


# హలో డాక్టర్!

## డాక్టర్ ఆర్వీయస్ సుందరం

వనజ మళ్ళీ డాక్టర్ ప్రసాద్ దగ్గరికి వెళ్ళింది. ఆయన దగ్గరికి వెళ్ళటం ఇది మూడోసారి. డాక్టర్ ప్రసాద్ ఇటీవలే ఆ వీథిలో క్లినిక్ తెరిచాడు. వయసులో చిన్నవాడే. బహుశా ముప్ఫయ్యేళ్ళు వుండవచ్చేమో. కాని మంచి ట్రీట్‌మెంట్ ఇస్తాడని పేరు తెచ్చుకున్నాడు. ఈ మధ్య ఎవరు ఆయన దగ్గరికి వెళ్ళినా అరగంటయినా వేచి వుండాల్సి వస్తోంది.

వనజకి ఈ మధ్య ఒంట్లో బాగుండటం లేదు. ఒకసారి తలనొప్పికి, మరోసారి వీపు నొప్పికి డాక్టర్ ప్రసాద్ దగ్గరికి వెళ్ళింది. వారం రోజులు కడుపు నొప్పితో బాధపడి ఇక లాభం లేదని మళ్ళీ డాక్టర్ దగ్గరికి వెళ్ళింది. ప్రసాద్ ఆమెను పరీక్షించి అమీబియాసిస్ అని తేల్చి మెట్రోజెల్ మాత్రలు ఒక కోర్సు ఇచ్చాడు. కోర్సు పూర్తి అయింది. కాని కడుపు నొప్పి మాత్రం తగ్గలేదు.

"వెంటనే వెళ్ళి స్కానింగ్ చేయించుకు రండి. నేను వుత్తరం రాసిస్తాను" అన్నాడు డాక్టర్.

"ఊరక డబ్బులు వదిలించటానికి రాసిస్తారు.. అక్కడ ఈ డాక్టర్లకు పర్సెంటేజ్ వుంటుంది" అన్నాడు వినయ్, వనజ భర్త.

"ఛీ! వూరుకోండి. డాక్టర్ ప్రసాద్ చాలా మంచివాడు. ఆయన మొహం చూస్తే అలాంటి వాడనిపిస్తోందా?"

"నీ మొహం" అన్నాడు వినయ్.

వనజ స్కానింగ్ చేయించింది. దానివల్ల ఏమీ తేలలేదు.

"ఏవైనా గడ్డలు గిడ్డలు వున్నాయేమో అని చూశాను. అలాంటివేమీ లేవు. మీరు వెళ్ళి సర్జన్‌కు చూపించండి. ప్రశాంతి నర్సింగ్ హోంలో డాక్టర్ శాంతి కుమార్ గొప్ప సర్జను. నేను వుత్తరం రాసిస్తాను" అన్నాడు ప్రసాద్.

వినయ్ మరోసారి విసుక్కున్నాడు. "నా మాట విని భాస్కర లవణం వరసబెట్టి వారం రోజులు తిను. నీ కడుపు నొప్పి మాయం అవుతుంది" అన్నాడు.

వనజ బిక్కమొగం వేసింది. ఆవిడ మొహం చూడలేక వినయ్ వెంటనే డాక్టర్ శాంతి కుమార్ దగ్గరికి పిలుచుకు వెళ్ళాడు.

డాక్టర్ శాంతికుమార్ వనజను పరీక్షించాడు.

"మీకు అపెండిసైటిస్. వెంటనే ఆపరేషను చేయించుకోండి" అన్నాడు.

వనజ వణికిపోయింది. ఆవిడ ఇంజెక్షన్ అంటేనే భయపడి వణుకుతుంది. అలాంటిది ఆపరేషన్ అనగానే మూర్ఛ వచ్చినట్లే అయింది.

"తప్పదమ్మా. ఈ రోజు కాకుంటే మరో వారం రోజులకైనా చేయక తప్పదు. ఎంత త్వరగా చేయించుకుంటే అంత మంచిది" డాక్టర్ అన్నాడు.

డాక్టర్ ప్రసాద్ కూడా వంత పాడాడు.

"శాంతికుమార్‌గారు చెప్తే దానికి తిరుగులేదండి. మీరు వెంటనే నర్సింగ్ హోంలో చేరటం మంచిది. మీకు ఒకవేళ అక్కడ ఎక్కువవుతుందనిపిస్తే చెప్పండి. నేను నా స్నేహితుల నర్సింగ్ హోంలో చేర్పిస్తాను".

ఒక రోజంతా ఆలోచించారు వనజ, వినయ్. చివరికి ప్రసాద్ చెప్పిన నర్సింగ్ హోంలో చేరటానికే నిశ్చయించుకుంది వనజ. చేరిపోయింది కూడా. అడ్మిషను, నెత్తురు పరీక్ష వగైరాలకు, స్పెషల్ రూంకు

అన్నిటికీ కలిపి వెయ్యి రూపాయలు కట్టించుకున్నారు. ఆపరేషను అయ్యేసరికి ఎంత లేదన్నా ఏడెనిమిది వేలు దాటేట్లు వుందని అంచనా వేశారు.

వినయ్ లెక్చరరు. ఒక చిన్న ఇల్లు కట్టుకోటం తప్పితే ఏమీ వెనకేసుకోలేదు. ఆపరేషను అనగానే అతని గుండెల్లో రాయి పడింది. ఆ ఫ్రెండూ ఈ ఫ్రెండూ అని తిరిగితే మూడు వేల వరకు పోగయింది.

నర్సింగ్ హోంలో చేరిన తర్వాత ఒక్కసారిగా వినయ్‌కి తన ఫ్రెండు డాక్టర్ విశ్వం జ్ఞాపకం వచ్చాడు.

"మనం చాలా తప్పు చేశాం వనజా. మన విశ్వం వున్నాడు కదా. మన గొడవల్లో పడి వాడిని అడగటమే మర్చిపోయాం. ఇప్పుడేం చేద్దాం" అని మథన పడసాగాడు వినయ్.

వనజ ఐదు నిముషాల్లో తేల్చేసింది. డ్యూటీ డాక్టరుతో "మా అబ్బాయి కాలేజి నుంచి వచ్చే వేళయింది. మేం వాడితో చెప్పలేదు. ఎలాగూ ఆపరేషను రేపు కాబట్టి ఇంటికి వెళ్ళి మా అబ్బాయితో చెప్పి మాకు కావలసిన బట్టలు వగైరా తీసుకు వస్తాం" అన్నది. డాక్టరు పర్మిషను తీసుకుని ఇద్దరూ వెళ్ళారు.


విశ్వం వినయ్ బంధువుల అబ్బాయి. ఎం.డి. కూడా చేశాడు. గవర్నమెంట్ హాస్పిటల్లో ఉద్యోగం దొరికింది. చాలా రోజులు అక్కడక్కడా పనిచేసి ఇటీవలే రాజమండ్రికి వచ్చాడు.

వనజను పరీక్షించిన విశ్వం "ఎవరండీ మీకు చెప్పింది అపెండిసైటిస్ అని...మీకు సుమారు నలభై ఏళ్ళు. ఈ వయసులో అపెండిసైటిస్ రావటం చాలా అరుదు. మీరు ఆపరేషన్ చేయించుకుంటే వేరే వేరే సమస్యలు మొదలవుతాయి. మీరు వెంటనే నర్సింగ్ హోం నుంచి డిశ్చార్జ్ అయి వచ్చేసెయ్యండి" అన్నాడు.

వీళ్ళకి ఏం చెయ్యటానికీ పాలుపోలేదు. "చేరాం కదండీ. ఇప్పుడెలా రావటం" అన్నాడు వినయ్.

"మీకు డబ్బులు ఎక్కువగా వుంటే ఆపరేషన్ చేయించుకోండి. డాక్టర్లను గురించి చెప్పటానికి నాకే సిగ్గుగా వుంది. ఈ గుట్టుమట్లన్నీ నాకు బాగా తెలుసు. కత్తెర వాడితే చాలు ఆ సర్జనుకు కొన్ని వేలు చేతిలో పడతాయి. ఇంక నేనేమీ చెప్పలేను" అన్నాడు విశ్వం.

వినయ్‌కి దిమ్మ తిరిగి పోయింది. 'ఎలాగైనా ఆపరేషన్ తప్పిపోతే అంతే చాలు' అని ముక్కోటి దేవతలకూ నమస్కారం చేస్తోంది వనజ.




చివరికి వినయ్ నర్సింగ్ హోంకి వెళ్ళి "ఉన్నపళంగా వనజ నాన్నగారు చనిపోయారని టెలిగ్రాం వచ్చింది. వెంటనే వెళ్ళాలి" అని చెప్పాల్సి వచ్చింది. వనజ తండ్రి చనిపోయి నాలుగేళ్ళయింది. దానికీ దీనికీ అని లెక్కకట్టి మూడు వందలు పట్టుకొని మిగిలిన డబ్బు తిప్పి ఇచ్చారు నర్సింగ్ హోం వాళ్ళు.

విశ్వం వనజను మరికొన్ని పరీక్షలు చేయించుకు రమ్మన్నాడు. మరోసారి రక్తం పరీక్ష చేయించుకు రమ్మన్నాడు. అన్ని పరీక్షలు చేయించుకు వచ్చిన తర్వాత "మీకు కొద్దిగా టి.బి. ఉండవచ్చని అనుమానిస్తున్నాను. ఆరు నెలలు నేను చెప్పిన మాత్రలు రెగ్యులర్‌గా తీసుకోండి. ఇప్పుడు ఏమీ భయపడాల్సిన అవసరం లేదు" అని మాత్రలు రాసిచ్చాడు.

వనజకు పై ప్రాణాలు పైనే పోయాయి. అసలే భయపడుతూ వుంటే పులి మీద పుట్రలా ఇదేవిటి? అనుకుంది. వినయ్ అన్నాడు "భయపడటంవల్ల ఏమీ లాభం లేదు వనజా ఎవరో ఒకర్ని మనం నమ్మాలి. ఏ డాక్టరు మీదా నమ్మకం లేకుంటే ఎలా."

రెండు రోజులు ఏమీ చెయ్యకుండా వూరుకున్నారు వనజ, వినయ్. తర్వాత డాక్టర్ మధుసూదనశాస్త్రి దగ్గరికి వెళ్ళారు. ఆయన చాలా సీనియర్ డాక్టర్. గవర్నమెంటు హాస్పిటల్‌లో చీఫ్ సర్జన్‌గా పనిచేసి రిటైరయ్యారు. "ఆయన ఏం చెప్తే అలా చేద్దాం" అనుకున్నారు. అయితే అంత పెద్ద డాక్టరు కూడా ఏమీ తేల్చలేదు.

"ఇది ఏమైనా కావచ్చు. అపెండిసైటిస్ కావచ్చు. లేదా ఇంటెస్టినల్ టి.బి.నే కావచ్చు. ఏదైనా ఆపరేట్ చేసి చూస్తేగాని ఏమీ చెప్పలేము. ప్రస్తుతానికి మాత్రలు రాసి ఇస్తాను. వీటితో తగ్గితే సరే. లేకుంటే ఆపరేషన్ చేయిద్దాం" అన్నారు డాక్టర్ శాస్త్రి.

అంత పెద్ద డాక్టర్ చెప్తున్నారు కదా అని ఆ మాత్రలు తెచ్చుకుని మింగింది వనజ. వెంటనే అలర్జీ అయింది. మొహంనిండా దద్దుర్లు వచ్చాయి. శాస్త్రిగారేమో వూరెళ్ళారు. ఆయన రావటానికి నాలుగు రోజులు పడుతుందన్నారు.

"నేనోమాట చెప్పేదా వనజ. నీవేం అనుకోకు. నీకు అసలు ఏ రోగమూ లేదు. ఇది మానసికం మాత్రమే. నా మాట విని హోమియోపతి తీసుకో. మన దానవాయిపేటలోనే మంచి డాక్టరు వున్నాడు. వెంటనే వెళ్దాం పద. అదీకాదంటే ఆపరేషను చేయించుకుందువుగాని" అన్నాడు వినయ్.

అసలే దిమ్మ తిరిగి పోయిన వనజ ఇక ఏమీ అనలేక పోయింది. హోమియోపతి కూడా అయింది. కాని వనజ కడుపునొప్పి మాత్రం తగ్గలేదు. వనజ ప్రతి రోజూ పడుతున్న బాధ చూస్తుంటే వినయ్‌కి ఏం చెయ్యటానికీ బోధపడటం లేదు. వనజకీ 'ఇక చాలు' అనిపించింది.

"మీరు మాత్రం ఏం చేస్తారు? చూడాల్సిన వాళ్ళందరూ చూచారు. ఒక్కొక్కరూ ఒక్కో మాట చెప్తున్నారు. చేసుకున్న పరీక్షలు చాలు. కొన్ని రోజులు నేను ఏమీ తీసుకోదలుచుకోలేదు" అన్నది వనజ.

ఒక రోజు వనజకి బాగా నొప్పి ఎక్కువయింది. దగ్గరగా వున్నది డాక్టర్ ప్రసాద్ క్లినిక్కే. వెళ్దామంటే 'ఆపరేషను చేయించుకోండి' అంటాడేమో అని భయం. విశ్వం దగ్గరికి వెళ్దామంటే 'టి. బి.' మాత్రలు తీసుకున్నారా అని అడుగుతాడు. ఏం చెయ్యటానికీ పాలుపోక చివరికి ప్రసాద్ దగ్గరికే వెళ్ళారు.

క్లినిక్ లోపల ఎవరో మాట్లాడుతున్నారు. బయట ఐదారు మంది కూర్చుని వున్నారు. వనజకు లోపల మాట్లాడుతున్న గొంతు ఎక్కడో విన్నట్లు అనిపించింది.

"మీరు పంపిన పేషెంట్ భలే పేషెంట్ బాబూ. వచ్చినట్లే వచ్చి నాన్న చనిపోయారని వెళ్ళిపోయింది. అన్యాయంగా నాకు రావలసిన ఐదారు వేలు పోయాయి. మీ కమీషనూ పోయింది. మళ్ళీ ఆవిడ వస్తుందో రాదో తెలీదు" డాక్టర్ చెప్తున్నాడు.

"ఇంతకీ ఆవిడకు ఆపరేషను దేనికి? అపెండిసైటిసే అంటారా?" ప్రసాద్ అడుగుతున్నాడు.

"అనే అనుకుంటున్నాను. ఏమైనా పొట్ట కోసి చూస్తే కాని తెలీదు. పొట్టకోసినందువల్ల ప్రమాదం ఏమీ లేదుకదా" నర్సింగ్ హోం డాక్టరు చెప్తున్నాడు.

వనజకు చెమటలు పట్టాయి. ఆవిడ మొహం చూసి వినయ్ ఆందోళన పడ్డాడు. మెల్లగా చెవిలో గుసగుసలాడాడు "ఇతను ఇలాంటి వాడని అందరినీ అలాగే అనుకోకు వనజా. అన్ని వృత్తులలో దొంగలు వున్నట్లే డాక్టర్ వృత్తిలోనూ వున్నారు. మనం తెలీక అతని దగ్గరికి వెళ్ళాం. మరి విశ్వం అలాంటివాడు కాదుకదా. డాక్టర్ శాస్త్రి అలాంటివాడుకాదు. ఇంతకీ మన రోజులు బాగులేవు."

"మరి ఈ ప్రసాద్ ఏమిటండీ! ఒక్క క్షణం కూడా ఇక్కడ వద్దు. పదండి వెళ్దాం" అన్నది వనజ.

అంతలో డాక్టర్ ప్రసాద్, అతని స్నేహితుడు బయటికి వచ్చారు.

"హలో డాక్టర్" అన్నాడు వినయ్.

ఇద్దరు డాక్టర్ల మొహాలూ నల్లగా మాడిపోయాయి. 'హలో' అన్నారు గాని మాటలు తడబడ్డాయి.

వాళ్ళ మాట ఎలా వున్నా వనజ సమస్యకు మాత్రం ఇంకా పరిష్కారం దొరకలేదు.